తెలంగాణ ఎంపీలకు శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఢిల్లీ వెళ్లిన కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కో– కన్వీనర్ శివాజీరాజు శనివారం రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు రాజిరెడ్డి, నానిరాజు ప్రదీప్, రఘురామరాజు తదితరులున్నారు.

గ్రూప్‌-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నిజాంపేట్: నేడు నిర్వహించే గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ, బీవీఆర్ఐటీ, విజ్ఞాన్, గోకరాజు రంగరాజు, వికాస్ ప్రగతి విద్యానికేతన్‌లలో సెంటర్లు ఉండటంతో ఆయా సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగనుందని, ఈ పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందు చేరుకోవాలని అధికారులు సూచించారు.

పాలపిట్ట పార్కు పని వేళలు

రాయదుర్గం: కొత్తగూడలోని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పాలపిట్ట సైక్లింగ్ పార్కులో ఆహ్లాద పూరిత వాతావరణంలో సైకిల్ నడిపే అవకాశం.

పని వేళలు..
- ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు
- సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు

సైకిళ్ల అద్దె వివరాలు..
- అడల్ట్స్/కిడ్స్–గంటకు రూ.59
- సొంత సైకిల్ తీసుకొస్తే నాలుగు గంటలకు రూ.59
- నెలవారీ పాస్ రూ.900

గ్రూప్‌-1 కోసం ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: నగరంలో నిర్వహించే గ్రూప్‌–1 అభ్యర్థుల కోసం ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులను నడుపుతోందని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మర్యాద మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు బస్టాండ్ల నుంచి పరీక్ష కేంద్రాల రూట్లో ఈ ప్రత్యేక బస్సులను స్పెషల్ బోర్డులతో నడపడం జరుగుతుందన్నారు. రోజువారీగా నడిచే బస్సులతో పాటు ఈ అదనపు బస్సుల ను కూడా నడపాలని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని పరీక్ష రాసే వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15న శాంతి సరోవర్‌లో ప్రత్యేక సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 15న పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే కార్యక్రమంలో 'ప్రాస్పరిటీ ఇన్ బిజినెస్ త్రూ ట్రెజర్స్ ఆఫ్ బ్లెస్సింగ్స్' అనే అంశంపై మౌంట్‌అబూకు చెందిన బి.కె.ఉషాదీదీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. ఇదే కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ, అరబిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హెచ్ఆర్ డాక్టర్ యూఎస్‌బీ రాజు, డ్యూక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రవీందర్ అగర్వాల్, టీహెచ్‌సీసీఎంఏ అజయ్‌కుమార్ అగర్వాల్ పాల్గొంటారు. మరిన్ని వివరాలకు 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

అవగాహనతోనే 'ట్యూమర్'పై విజయం

సాక్షి,సిటీబ్యూరో: మెదడు కణితులతో పోరాటంలో వ్యాధిపై అవగాహనే విజయానికి తొలి మెట్టు అని టాలీవుడ్ నటి డాక్టర్ రూప కొడువాయుర్ అన్నారు. హైటెక్‌సిటీలోని కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా వ్యాధిపై పోరాటంలో విజయం సాధించిన సర్వైవర్స్‌తో శనివారం అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తగిన అవగాహనతో ప్రారంభ దశలోనే రోగ నిర్ధారణ చేసి సరైన చికిత్స అందిస్తే వ్యాధిపై విజయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి డాక్టర్ రజత్ కుమార్, కేర్ హాస్పిటల్స్, హెచ్ సీఓఓ సునీత్ అగర్వాల్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంటలోని మాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీజీ, బీటెక్ చదువుతున్న పేద విద్యార్థులైన శ్రావణ్, కొండా శివతేజలకు రూ. 17 వేలు, రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ... విద్యాదానం మహాదానం అని పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తమ క్లబ్ తరపున ఆర్థిక చేయూతతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కేశవచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.5 లక్షల నగదు, ఆభరణాల ఎత్తుకెళ్లిన వైనం



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

నిజాంపేట్: పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. తాళం వేసిన ఇంట్లో రూ.5 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ గఫార్ టైలరింగ్ పనులు చేస్తుంటాడు. ఇటీవల తన కుమార్తెకు బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో ఇంటిని కొనుగోలు చేసిన గఫార్ బ్యాంక్ రుణంతో పాటు మిత్రుల నుంచి తీసుకున్న రూ.5 లక్షలను శుక్రవారం ఉదయం ఇంట్లోని బీరువాలో భద్రపరిచి పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్న అతడు ఇంట్లోకి వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటికి వేసిన తాళం వేసినట్లే ఉండటంతో తెలిసిన వారి పనేనని పోలీసులు భావిస్తున్నారు.

వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం

కట్టు కాలువపై అక్రమ నిర్మాణాలపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



కట్టు కాలువపై వెలసిన నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: కట్టు కాలువపై వెలసిన నిర్మాణాలపై 'సాక్షి' వరుస కథనాలతో అధికార యంత్రాంగం కదిలింది. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సంయుక్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కట్టుకలువపై వెలసిన ప్రహరీలను కూల్చివేసి కాల్వకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమారు చెరువు తూము నుంచి సర్వేనెంబర్ 2, 3 మీదుగా వెళ్లే కట్టు కాల్వను కొంతమంది కలుపుకొని చుట్టూ ప్రహరీ నిర్మించారు. దీంతో సంబంధిత అధికారులకు స్థానిక రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో కట్టు కాలువ కబ్జాపై మే 29న, జూన్ 4 న 'సాక్షి'లో కథనాలను ప్రచురించి కబ్జా భాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఘటనా చేరుకుని కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకున్నారు.

మరోసారి వెలువడిన కథనం..

ఈ విషయమై అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతో మరోసారి 'సాక్షి' కుండలు బద్దలు చేసింది. దీంతో గ్రామస్తులు కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకొచ్చి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. శనివారం ఉదయం 4 గంటలకు పోలీస్ భద్రత మధ్య దుండిగల్ తహశీల్దార్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి నేతృత్వంలో 4జేసీబీలతో అక్కడికి చేరుకుని కూల్చివేతలు చేపట్టారు. సుమారు 300 మీటర్ల కట్టు కాలువను కలుపుకుని నిర్మించిన ప్రహరీని నేలమట్టం చేశారు.

ఊరు కదిలి...

గతంలో అలుగు నుంచి వెళ్లే నాలా కబ్జాకు గురికాగా.. తాజాగా తూము నుంచి వెళ్లే కట్టుకాలువ కబ్జాకు గురికావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలు చేపడుతున్న విషయం తెలుసుకుని చెరువు వద్దకు భారీగా తరలివచ్చారు.

గత ప్రభుత్వం లాగా చేస్తానంటే ఊరుకునేది లేదు : మైనంపల్లి

కూల్చివేతలను మైనంపల్లి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను అనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ నేత నర్సారెడ్డి భూపతి రెడ్డిల స్థానిక నేతలతో కలిసి సందర్శించారు. కట్టు కాలువపై నిర్మాణాలపై అధికారులను ప్రశ్నించారు. గుండ్ల పోచంపల్లి పరిధిలోకి వచ్చే స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాల గురించి ఆ ప్రాంత కమిషనర్‌తో మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగా కబ్జాదారులకు అండగా ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కూల్చివేయకుండా ఫిర్యాదు చేస్తాం..

దిగువన ఉన్న లింగయ్య చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కూల్చివేతలు చేపట్టకపోతే ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం చెరువు ఎక్కువ భాగాన ఎఫ్‌టీఎల్ స్థలంలో మట్టిపోసి చదును చేస్తున్న ప్రదేశాన్ని, మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాల, హాస్టళ్ల నుంచి చెరువులో కలిసే మురికి నీరే నాలాను స్థానికులతో కలిసి పరిశీలించారు.

ముందే అడ్డుకుంటే..

తుమారు చెరువు దిగువ భాగాన తూము నుంచి వెళ్లే కట్టు కాలువపై వెలసిన ప్రహరీ నిర్మాణాన్ని ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు ముందే అడ్డుకుంటే ఇంతవరకు వచ్చేది కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కట్టు కాలువను కలుపుకొని చేపట్టిన ప్రహరీ కూల్చివేతతో సదరు వ్యక్తులకు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆ నాలా కబ్జా జోలికి వెళ్లలేదు...

చెరువు అలుగు నుంచి సుమారు 50 ఫీట్ల మీద విస్తరించి ఉన్న నాలా కబ్జాకు గురైంది. ఈ విషయమై గతంలో 'సాక్షి' పలుసార్లు వెలుగులోకి తీసుకొచ్చిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి.

ఉచితవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జనహిత సేవా ట్రస్ట్ ఆర్గనైజర్ ఆదిత్య అన్నారు. జనహిత సేవా ట్రస్ట్, సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన ఈ వైద్యశిబిరంలో సుమారు 250 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ,షుగర్, సాధారణ, స్త్రీల సంబంధిత ఆరోగ్య సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆర్గనైజింగ్ సభ్యుడు ఆదిత్య మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తమ ట్రస్టు ద్వారా బస్తీలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనహిత సేవాట్రస్టు సభ్యులు, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ బొడిగే లింగస్వామి

దుండిగల్: రిసోర్స్ పర్సన్ల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బొడిగే లింగస్వామి అన్నారు. దుండిగల్ మున్సిపల్‌లో పనిచేస్తున్న ఆర్పీలు గండిమైసమ్మలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆర్పీలకు ప్రభుత్వం ఎలాంటి గుర్తింపు ఇవ్వకుండా అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆరోపించారు. కనీసవేతనం అమలు చేసి ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చే జీతాలను వారి అకౌంట్లోనే వేయాలని కోరారు. గుర్తింపుకార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. శాంత, రాణి, ఆదిలక్ష్మి, అరుణ, ఉమ, రేణుక, నీరజ, లత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే వివేకానంద్ స్వామికి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు నాగార్జున ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, కార్పొరేటర్లు ప్రణయయాదవ్, రాఘవేంద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్ని క్రిష్ణన్ నంబూద్రి మెల్సంతి, శ్రీనివాస్, ఎన్.హరిబాబు, దీపక్, గురుస్వామి ఇంద్రకుమార్‌దేవ్, గ్రామపెద్దలు కొలన్ లీడర్ నర్సింహారెడ్డి, సాయి లుయాదవ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు



వెంకటాద్రినగర్ నాలాలో ఇలా..

జీడిమెట్ల: వర్షాకాలం రాకముందే నాలాల్లో వ్యర్థాలు తొలగించకపోతే సుభాష్‌నగర్‌లో ముప్పు తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ గంపలబస్తీ, వెంకటాద్రినగర్‌లో ఇప్పటికే నాలాలు కబ్జాకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. వర్షాకాలం కావడంతో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంతో పాటు ఫాక్స్‌సాగర్ నుంచి వర్షపు నీరు పెద్దఎత్తున రెండు కాలనీలతో పాటు సుభాష్‌నగర్ వైపు వస్తుంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఇప్పటికే ఔట్‌లెట్‌లు చెత్తతో మూసుకుపోయి ఉన్నాయి. దీంతో వర్షపు నీరు నాలా నుంచి వెళ్లకుండా ఇళ్లల్లోకి వచ్చి చేరే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గతేడాది నీటిలో మునిగిన గంపలబస్తీ..

గతేడాది రాత్రి కుండపోత వర్షం కురవడంతో నాలా నుంచి నీరు బయటకు వెళ్లే దారిలేక మొత్తం నీరు ఇళ్లల్లోకి వచ్చి చేరింది. దీంతో ఇళ్లల్లో ఉన్న ప్రజల సామగ్రి మొత్తం నీటిలో మునిగిపోయాయి. ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీరు రావడంతో నిద్రలో ఉన్న ప్రజలంతా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ఇళ్లపైకి ఎక్కి నిల్చున్న పరిస్థితి ఏర్పడింది.

అధికారుల అలసత్వం.. ప్రజలకు నష్టం..

ప్రతిసారి వర్షాకాలం సమీపించే ముందు నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈసారి వర్షాలు కురిస్తే ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకుని నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

సుభాష్‌నగర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం సాయిబాబానగర్‌కు చెందిన నగేష్, నాగమణి భార్యాభర్తలు. కాగా గత నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త కనిపించకుండా పోయాడు. అతడి మొబైల్‌కు ఫోన్ చేస్తే వేరే వ్యక్తి అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని.. గతంలో ఇదే తరహాలో రెండు నెలల పాటు ఇంటి నుంచి వెళ్లిపోయాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆందోళన గురైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించడంతో యువతి..

సుభాష్‌నగర్: ఇంట్లో పని విషయమై తల్లి మందలించడంతో ఓ యువతి ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం విశ్వకర్మ కాలనీకి చెందిన శశికళ, కుమరయ్యల కుమార్తె లావణ్య(22) బీఈడీ చదువుతోంది. ఈనెల 5న ఇంట్లో పని విషయమై.. కుమార్తెను తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. సాయంత్రమైనా కుమార్తె ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



జగద్గిరిగుట్ట: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మ నగర్‌కు చెందిన కమ్మరి భవానీ(32), భానుచందర్‌లు భార్యాభర్తలు. కాగా ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు రాగా.. మనస్తాపానికి గురైన భార్య ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కేసులు పెట్టినా బెదరని కబ్జాదారులు



సుభాష్‌నగర్: విలువైన స్థలం కబ్జాకు గురికాకుండా ఓ వైపు రెవెన్యూ అధికారులు కాపాడేందుకు చుట్టూ ఫెన్సింగ్ వేసే పనిలో ఉండగా.. మరోవైపు కబ్జాదారులు ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. గాజులరామారంలోని సర్వే నంబర్ 13 లో ఎకరాకు పైగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేసేందుకు యత్నించగా.. 'సాక్షి' కథనాలతో సంబంధిత అధికారులు స్పందించారు. సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. అంతలోనే కబ్జాదారులు బోర్డును తొలగించి కబ్జాకు యత్నించగా.. తాహసీల్దార్ రెహమాన్ ఆదేశాలతో నలుగురిపై కేసులు నమోదు చేశారు. సదరు స్థలంపై కబ్జాదారులు పట్టు వీడటం లేదు.

గోశాల పేరుతో...

గోశాల పేరుతో గుడిసెలు వేసి సదరు విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు తెరలేపారు. దీంతో సంబంధిత అధికారులు రెండ్రోజుల్లో సదరు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రజా ప్రయోజనాల కోసం కేటాయిద్దాం.. అన్న తరుణంలో ఆ కబ్జాదారులు శుక్రవారం రాత్రి ఓ గదిని నిర్మించి, శనివారం పట్టపగలే మూడు గదుల నిర్మాణాలు చేపట్టారు.

కేసులు నమోదు చేస్తాం..



ఎన్నికల నేపథ్యంలో కొంత ఆలస్యం జరిగింది. అప్పటికే నలుగురిపై కేసులు నమోదు చేశాం. తాజాగా నిర్మించే గదులను కూల్చివేసి కబ్జాదారులపై తిరిగి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– రహమాన్‌ఖాన్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్

పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మందాల భాస్కర్ అధ్యక్షత వహించగా పుస్తక రచయిత నలమాస కృష్ణ, ప్రొ.కాశీం, ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రొ.ననుమాసస్వామి, ప్రొ.గాలి వినోద్‌కుమార్, ఓయూ పూర్వవిద్యార్థి నాయకులు తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

'నీట్' పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

లిబర్టీ: నీట్ పరీక్షా ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహణా తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మే 5న నిర్వహించిన పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. కాగా ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం, వారి పరీక్షా కేంద్రం ఒకటే కావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీకి 'ఉత్తమ సేవా పతకం'



కమిషనర్ అవినాష్ మహంతి చేతుల మీదుగా పతకాన్ని అందుకుంటున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: విధి నిర్వహణలో భాగంగా విశేష సేవలు అందించిన బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా శనివారం సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి చేతుల మీదుగా ఈ పతకాన్ని అందుకున్నారు. 2023 జులై 28న ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నర్సాపూర్ రాష్ట్ర రహదారిని మొదలుకుని గండిమైసమ్మ చౌరస్తా వరకు... గాజులరామారం రోడ్డు విస్తరణ పనులు, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు, రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తూ.. ముందుకు సాగుతున్నారు. గతంలో 'కఠిన సేవా పతకం' రాగా.. తాజాగా 'ఉత్తమ సేవ పతకం' ద్వారా ఉన్నత అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. గడిచిన ఏడాదిలో బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ పరిధిలో పలు మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి.

- గాజులరామారం నుంచి మహదేవపురం మీదుగా కూకట్‌పల్లికి వెళ్లే రహదారి వివిధ ఐటీ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల రాకపోకలతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసులు రోడ్డు పక్కనే ఉన్న తోపుడు బండ్లను తొలగించి రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు.

ట్రాఫిక్ సిగ్నల్‌కు నివేదిక..

- గాజులరామారం గ్రామం వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుకు ఇప్పటికే నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు.
- రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఫ్రీ లెఫ్ట్‌తో పాటు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించకుండా ఉదయం నుంచి రాత్రి వరకు సిబ్బందిని నియమించారు.
- గూడెన్‌మెట్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉండగా.. జగద్గిరిగుట్టకు వెళ్లే మూలమలుపు వద్ద ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేయడంతో ఆ సమస్య అధిగమించినట్లైంది.
- వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు వాటర్ డ్రైయిన్ నిర్మాణానికి తోడ్పాడును అందించడంతో ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతున్నాయి.
- విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు పలు స్కూళ్లు, కాలేజీలను ఎంపిక చేసుకుని సుమారు 50 వరకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

త్రిబుల్ డ్రైవింగ్‌పై..

- సిగ్నల్స్ వద్ద వ్యవహరించాల్సిన తీరు త్రిబుల్ డ్రైవింగ్‌తో కలిగే ఇబ్బందులు, ప్రాణ నష్టం జరిగితే తల్లిదండ్రులు ఏ విధంగా బాధపడతారన్న విషయాలపై పలు కార్యక్రమాలను చేపట్టారు.
- నో ఎంట్రీ సమయాల్లో ప్రైవేటు బస్సులతో పాటు టిప్పర్లు, హెవీ వెహికల్స్ నిబంధనలను అతిక్రమిస్తే వాటిని గుర్తించి సుమారు 400కు పైగా వాహనాలపై చర్యలకు తీసుకుని జిల్లా రవాణా అధికారులకు లేఖలు అందజేశారు.
- రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపిన వారిపై పలు సెక్షన్ల కింద పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.
- జీడిమెట్ల పారిశ్రామికవాడతో పాటు గాంధీ నగర్, బాలానగర్ పారిశ్రామికవాడల్లో పార్కింగ్ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి.. పార్కింగ్ స్థలాల సేకరణ విషయంపై దృష్టి సారించారు.
- షాపూర్‌నగర్‌లోని సాయి కాంటా వద్ద రోడ్డు విస్తరణ కోసం లేఖలు కూడా రాశారు. ఇలా అనేక రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి విషయాల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవ పథకం ద్వారా ప్రోత్సహించడం విశేషం.